ఎంబిఎ కన్వీనర్ కోటాలో 23,989 సీట్లు

- ఎంసిఎలో 4,583 సీట్లు
- నేటి నుంచి ధ్రువపత్రాల పరిశీలన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఎంబిఎ, ఎంసిఎ కోర్సుల్లో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన ఐసెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా మంగళవారం నుంచి ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఐసెట్ ప్రవేశాల కన్వీనర్ శ్రీదేవసేన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంబిఎలో 33,629 సీట్లున్నాయని తెలిపారు. అందులో కన్వీనర్ కోటాలో 23,989 సీట్లున్నాయని పేర్కొన్నారు. ఎంసిఎలో 6,162 సీట్లుంటే, కన్వీనర్ కోటాలో 4,583 సీట్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. సోమవారం నాటికి 10,634 మంది అభ్యర్థులు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించారని తెలిపారు. ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపునకు తుది గడువు ఈ నెల ఎనిమిదో తేదీ వరకు ఉందని పేర్కొన్నారు. మంగళవారం నుంచి ఈ నెల తొమ్మిదో తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని వివరించారు. నాలుగు నుంచి 11 వరకు వెబ్‌ఆప్షన్లను నమోదు చేసేందుకు అవకాశముందని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం https://tgicet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

భారీ వర్షాలకు 1400 బస్సు సర్వీసులు రద్దు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారీవర్షాల కారణంగా టిజిఎస్‌ఆర్‌టిసి తెలుగు రాష్ట్రాల్లో పలుచోట్ల బస్సులను రద్దు చేసింది. ఆదివారం రాత్రి వరకు 877, సోమవారం ఉదయం నుంచి 570 కలిపి 1400కు పైగా బస్సులను రద్దు చేసింది. ముఖ్యంగా ఖమ్మం, విజయవాడ, మహబూబాబాద్ వైపుగా వెళ్లే రోడ్లన్నీ జలమయం కావడంతో ఆయా మార్గాల్లో బస్సులను పూర్తిగా రద్దు చేసినట్లు ఆర్‌టిసి అధికారులు తెలిపారు. వరద ఉధృతి తగ్గిన తర్వాత మళ్లీ నడుపుతామని చెప్పారు. హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్లే బస్సులను గుంటూరు మీదుగా దారి మళ్లించినట్లు పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాకు యథావిధిగా బస్సులను నడుపుతున్నట్లు వివరించారు. వరద ప్రవాహం వల్ల వికారాబాద్‌లో 212 బస్సులకు బదులు 50 మాత్రమే నడుపుతున్నట్లు రంగారెడ్డి ఆర్‌ఎం శ్రీలత తెలిపారు.

అండగా ఉంటాం... ధైర్యంగా ఉండండి

- వరద బాధితులకు రూ.10 వేలు తక్షణ సాయం
- మరణించిన పశువులు, మేకలకూ పరిహారం
- సర్టిఫికెట్లు పోయినవారికి కొత్తవి..
- ఖమ్మం ముంపు ప్రాంతాల్లో పర్యటించిన సిఎం
- తక్షణసాయంగా రూ.2 వేల కోట్లు అందజేయాలని కేంద్రానికి విజ్ఞప్తి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారీ వర్షాలు, వరదల కారణంగా సర్వం కోల్పోయిన అభాగ్యులను అన్నివిధాలా ఆదుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో ముంపు ప్రాంతాల్లో సోమవారం మంత్రులతో కలిసి ముఖ్యమంత్రి పర్యటించారు.బాధితులను కలిసి మాట్లాడారు. అధైర్య పడవద్దని ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ముంపు ప్రాతాల్లో అధికారులు చేపడుతున్న సహాయక చర్యలను దగ్గరుండి పర్యవేక్షించారు. అనంతరం సమీక్షా సమావేశం నిర్వహించారు. తెలంగాణలో భారీవర్షాల కారణంగా రూ.5438 కోట్ల నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా ఉందనీ, జాతీయ విపత్తుగా ప్రకటించాలని కేంద్రాన్ని కోరారు. తక్షణ సాయంగా రూ.రెండు వేల కోట్లు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. వరదల సమయంలో బిఆర్‌ఎస్ పార్టీ బురద రాజకీయం చేస్తుందనీ, అమెరికాలో తిరుగుతూ కెటిఆర్ ట్వీట్ చేయడం బాధాకరమన్నారు. ప్రజల్లోకి రాని వారికి ప్రతిపక్ష నేత హోదా ఎందుకని కెసిఆర్‌ని ఉద్దేశించి అన్నారు. కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకునేందుకు కాంగ్రెస్ శ్రేణులు ముందుకు రావాలని, వ్యాపారావేత్తలు స్వచ్ఛంద సంస్థలు కూడా స్పందించాలన్నారు. అన్ని విభాగాలు టీం వర్కుగా సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రోడ్డు మార్గంలో ఖమ్మం వచ్చిన సిఎం..మార్గమధ్యలో పాలేరు వాగు వరదకు దెబ్బతిన్న రోడ్లను పరిశీలించారు.అక్కడ స్థానికులతో మాట్లాడారు.అనంతరం ఖమ్మం

రాజీవ్ గృహకల్ప కాలనీలో పర్యటించారు. ఇళ్లు నీట మునగడంతో తీవ్రంగా నష్టపోయిన వరద బాధితులకు రూ.10వేలు చొప్పున తక్షణ సాయం అందించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ప్రతి కుటుంబానికీ నిత్యావసరాలు అందించాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. భారీ వర్షాలకు ప్రభావితమైన ప్రతి కుటుంబానికీ బియ్యం, ఉప్పు, పప్పు, మంచినీరు అందించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఎవరికైనా ప్రాణనష్టం జరిగితే రూ.ఐదు లక్షలు, పశు సంపద నష్టం వాటిల్లితే రూ.50వేలు, గొర్రెలు, మేకలు చనిపోతే రూ.ఐదు వేలు చొప్పున ఇవ్వాలని ఆదేశించారు. ఇల్లు దెబ్బతింటే ఆ ఇళ్లకు పిఎం ఆవాస్ యోజన కింద నష్టాన్ని అంచనా వేసి దానికి ఆర్థిక సాయం అందిస్తాం. వరదల వల్ల సర్టిఫికెట్లు పోయినవారికి కొత్తవి ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.

సిఎం వెంట డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపి రఘురాం రెడ్డి తదితరులు ఉన్నారు.

సూర్యాపేట జిల్లాలో వర్షాలు, నష్టాలపై మోతె మండల పరిధి రాఘవపురం ఎక్స్ రోడ్డులోని పిఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం జిల్లా అధికార యంత్రాంగంతో సిఎం సమీక్ష నిర్వహించారు. తక్షణ సాయంగా జిల్లాకు రూ.ఐదు కోట్లు అందజేయాలని చీఫ్ సెక్రటరీకి ఆదేశాలు జారీ చేశారు. ఈ సహాయాన్ని స్థానిక కలెక్టర్ ఏ ప్రాంతంలో అవసరముంటే ఆ ప్రాంతంలో వాడుకోవచ్చని చెప్పారు. రాష్ట్ర విపత్కర పరిస్థితి గురించి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అడిగి తెలుసుకున్నారన్నారు. వర్షంలో నష్టపోయిన ప్రజలను, రైతులను ఆదుకోవడానికి వారు ముందుకొచ్చారని చెప్పారు. తక్షణ సాయంలో భాగంగా రాష్ట్రానికి రూ.2000 కోట్లు కేంద్రం అందించేందుకు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

కులగణనపై అఖిలపక్షం ఏర్పాటు

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి డిమాండ్
- గాంధీఆస్పత్రిలో సంజయ్‌కుమార్, బత్తు సిద్ధేశ్వర్‌కు పరామర్శ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కులగణనపైనా, స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపైనా అఖిపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నరసింహారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కులగణన చేపట్టాలనీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బిసి ఆజాదీ యూత్ ఫెడరేషన్ అధ్యక్షులు జక్కని సంజయ్ కుమార్, బిసి మహాసభ అధ్యక్షులు బత్తుల సిద్ధేశ్వర్ తదితరులను సోమవారం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నరసింహారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎంవి రమణ, పి ఆశయ్య పరామర్శించారు. ఈ సందర్భంగా డిజి నరసింహారావు మాట్లాడుతూ... న్యాయమైన డిమాండ్లపై దీక్ష చేస్తున్న వారిని ప్రభుత్వం అరెస్ట్ చేయడాన్ని ఖండించారు. తొమ్మిది రోజులుగా దీక్ష చేస్తున్న వారికి సంఘీభావం ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ప్రకటించిన విధంగా కులగణన చేపట్టాలనీ, స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కులగణనపై నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నదని విమర్శించారు. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలనీ, అప్పుడే దీనికి చట్టబద్ధత వస్తుందని అన్నారు. 50 శాతం రిజర్వేషన్ మించరాదన్న సుప్రీం కోర్టు తీర్పునకు అడ్డు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



సింగూరు ఎడమ కాలువకు గండి

- పంట పొలాల్లోకి భారీగా వరద నీరు
- లబోదిబోమంటున్న రైతులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గత నాలుగు రోజులు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో సింగూరు ఎడమ కాలువ వరద నీటితో నిండి.. దానికి అనుసంధానంగా ఉన్న పిల్ల కాలువల్లోకి పెద్ద ఎత్తున నీరు చేరుతున్నది. ఈ క్రమంలో సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండల పరిధిలోని ఇసోజిపేట గ్రామ శివారులో ఆ కాల్వకు గండిపడింది. దాంతో నీటితోపాటు పెద్దఎత్తున మట్టి కూడా వ్యవసాయ పొల్లాల్లోకి కొట్టుకుపోయింది. ఒక్కసారిగా కట్ట పగిలిపోవడంతో నీరంతా పొలాల్లోకి చేరిందని.. పంటలు పూర్తిగా దెబ్బతినే దుస్థితి వచ్చిందని బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటికి ఏ ఒక్క అధికారి స్పందించలేదని వాపోయారు. గతేడాది కూడా ఇదే కాలువకు గండి పడగా.. అప్పటి ఆందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ వెంటడే స్పందించి నేరుగా ఆయన ఘటనా స్థలానికి చేరుకుని జెసిబిల సాయంతో గండిని పూడ్చి వేయించారన్నారు. ఇప్పుడు కూడా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గండిని పూడ్చాలని రైతులు కోరుతున్నారు.

రిజర్వాయర్లకు పోటెత్తిన వరద

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని రిజర్వాయర్లకు వరద పొటెత్తింది. ప్రత్యేకించి కృష్ణా బేసిన్‌లో శ్రీశైలం నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు నీటి ప్రవాహం ఉధృతంగా ఉంది. ఎగువన కర్నాటక నుంచి నీటి విడుదల తక్కువగానే ఉన్నా, స్థానికంగా కురిసిన అతిభారీ వర్షాలతోపాటు రెండు తెలుగు రాష్ట్రాల్లోని రిజర్వాయర్లల్లోకి గణనీయంగా ప్రవాహం ఉండటంతో గేట్లన్ని ఎత్తి దిగువకు వదులుతున్నారు. సోమవారం శ్రీశైలంలోకి దాదాపు 5.16 లక్షలకుపైగా వరద రాగా, సాయంత్రానికి 5.21 లక్షలకు చేరింది. నాగార్జునసాగర్‌కు కూడా సుమారు 5.38 లక్షల క్యూసెక్కుల ప్రవాహం ఉంది. పులిచింతలలో 5.94లక్షల క్యూసెక్కుల నుంచి 6.04 లక్షల క్యూసెక్కులకు పెరగ్గా, ప్రకాశం బ్యారేజీ వద్ద 11.28 లక్షల క్యూసెక్కుల వరకు ఉంది. ఇది ఇంకా పెరిగే అవకాశం ఉన్నట్టు అధికారిక సమాచారం. మూసీ. మున్నేరు వాగుల నుంచి భారీగా వస్తున్న వరద, స్థానికంగా కురిసిన భారీ వర్షాలతో శ్రీశైలం, ప్రకాశం బ్యారేజీ మధ్యనే ఐదు లక్షల క్యూసెక్కులకు పైగా వరద వచ్చి చేరింది. కేంద్ర జలసంఘం అంచనా ప్రకారం బుధవారం వరకు భారీగా వరద ప్రవాహం కొనసాగే అవకాశం ఉందని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. గోదావరిలో కూడా ప్రవాహం కొనసాగుతుంది. శ్రీరాంసాగర్, కడెం, ఎల్లంపల్లి, మేడిగడ్డ ఇలా అన్ని ప్రాజెక్టుల్లోకి వరద వస్తున్నది. వచ్చే మూడు, నాలుగు రోజులు కూడా వానల నేపథ్యంలో వరద పెరిగే అవకాశం ఉంది.

ములుగులో చిరుత సంచారం

ప్రజాశక్తి-హైదరాబాద్‌బ్యూరో

ములుగు జిల్లా మదనపల్లి గ్రామంలో చిరుతపులి సంచరిస్తున్నది. పాదముద్రల ఆధారంగా ఫారెస్ట్ అధికారులు చిరుత సంచారాన్ని గుర్తించారు. ఆ క్రమంలో ములుగుతో పాటు మదనపల్లి గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. పాదముద్రలను గుర్తించామని.. పాదముద్రలను పరిశీలించగా చిరుతవేనని నిర్ధారణ అయ్యిందని చెప్పారు. ఆయా గ్రామాల ప్రజలతో పాటు పశువులకాపరులు అటవీ ప్రాంతంలోకి వెళ్లొద్దని.. రాత్రివేళల్లో చిన్నపిల్లలకు బయటకు పంపొద్దని సూచించారు. ఫారెస్ట్ అధికారుల హెచ్చరికల నేపథ్యంలో ఆయా గ్రామాల జనం ఆందోళనకు గురవుతున్నారు. అధికారులు తక్షణమే చిరుతను బంధించాలని కోరుతున్నారు.

కేంద్రం నిధులను దారిమళ్లించారు

- మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

ప్రజాశక్తి-హైదరాబాద్‌బ్యూరో

కాంగ్రెస్ పాలనలో సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆరోపణలు చేశారు. చేసిన పనులకు బిల్లులు రాక వారు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ... రూ.1300 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. అప్పులు తెచ్చి చేసిన పనులకు బిల్లులు ఇవ్వకపోవడంతో సర్పంచ్‌లు రోడ్డున పడ్డారని తెలిపారు. కేంద్రం నుంచి పంచాయతీలకు వచ్చిన నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం దారి మళ్లించిందని ఆరోపించారు. సర్పంచ్‌ల మీద కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు ఎందుకు చేస్తోందని ప్రశ్నించారు. వారం రోజుల్లో సర్పంచ్‌ల బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఇందిరా పార్క్ వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. సర్పంచ్‌లకు తాము అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి : టిజిఇజెఎసి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సిపిఎస్, యుపిఎస్ మాకెందుకు? పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తే చాలని టిజిఇజెఎసి చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్‌రావు, జెఎసి నేతలు చావ రవి, తదితరులు డిమాండ్ చేశారు. పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. దేశవ్యాప్తంగా కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానంలో పని చేస్తున్న ఉద్యోగులకు ఇటీవల యూనిఫైడ్ పెన్షన్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని తెలిపారు. దీన్ని ఉద్యోగులు అంగీకరించనప్పటికీ ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగులకు 2004కు ముందున్న పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆ విధానంలో ఉద్యోగి రిటైర్ అయినప్పుడు ఉన్న చివరి వేతనం (బేసిక్, డిఎ)లోని 50 శాతం పెన్షన్ రూపంలో ఉద్యోగికి చెల్లించే వారని గుర్తు చేశారు. పెరుగుతున్న సగటు ఆయుప్రమాణం, పెరుగుతున్న ఉద్యోగుల సంఖ్య, వేతనాల భారాన్ని తగ్గించుకునేందుకు పెన్షనర్లకు అన్యాయం చేస్తే ఎలా? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమం కోసం సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేయలనీ, ఉద్యోగుల పెండింగ్ సమస్యలన్నీ పరిష్కరిస్తామని ఇచ్చిన హామీ ప్రకారం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెఎసిలో భాగస్వాములుగా ఉన్న 205 సంఘాల నేతలు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం

- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

ప్రజాశక్తి-హైదరాబాద్‌బ్యూరో

ఖమ్మం జిల్లాతోపాటు తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురిశాయని.. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లాతోపాటు రాష్ట్రంలో చాలా ప్రాంతాలు దెబ్బతిన్నాయని తెలిపారు. ఖమ్మంలో మల్లు భట్టి విక్రమార్క సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ వర్షాలపై అధికారులకు ఆదేశాలు ఇచ్చి హెచ్చరించిన రెండు రోజుల్లోనే విపత్కర పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. తన జీవితంలో ఇంతవరకు ఇలాంటి వరద చూడలేదని తెలిపారు. వాగులు, నదులు పొంగాయన్నారు. సబ్ స్టేషన్లు మునిగిపోయాయని, విద్యుత్ స్తంభాలు కూలిపోయాయని తెలిపారు. ఎప్పటికప్పుడు అధికారులను అప్రమత్తం చేశామని చెప్పారు. బాధితులకు అండగా నిలిచామని అన్నారు. మంత్రులు, అధికారులు సహాయక చర్యలలో పెద్దఎత్తున పాల్గొన్నారని తెలిపారు. నష్టం అంచనాలు వచ్చిన తర్వాత పూర్తి స్థాయిలో పరిహారం అందజేస్తామని హామీ ఇచ్చారు. టిట్వర్, సోషల్ మీడియాకు పరిమితమైన కొందరు నేతలు ప్రజలను భయబ్రాంతులకు గురిచేస్తున్నారని ఆయన మండిపడ్డారు.

త్వరితగతిన ట్రాక్ సిద్ధం చేయాలి..

- కేసముద్రం సెక్షన్ పనులను పరిశీలించిన జిఎం అరుణ్‌కుమార్ జైన్

ప్రజాశక్తి-హైదరాబాద్‌బ్యూరో

వర్షాలకు దెబ్బతిన్న మహబూబాబాద్ జిల్లా కేసముద్రం-ఇంటికన్నె సెక్షన్‌లో ట్రాక్‌ను సిద్ధం చేయాలని సిబ్బందిని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ ఆదేశించారు. కేసముద్రం, ఇంటికన్నె వద్ద జరుగుతున్న ట్రాక్ మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కేసముద్రం సెక్షన్‌లోని 418-432 కిలోమీటర్ల మధ్య వరద పొంగడంతో ఆదివారం ట్రాక్ దెబ్బతిన్నది. సోమవారం క్షేత్రస్థాయిలో ఆయన మరమ్మతు పనులను సమీక్షించి.. సిబ్బందికి సూచనలు చేశారు. వీలైనంత త్వరగా ట్రాక్‌ని వినియోగంలోకి తీసుకురావాలన్నారు. సెక్షన్ పరిధిలో ఐదు ప్రాంతాల్లో ట్రాక్‌కు నష్టం జరిగింది. ఇందులో నాలుగు ప్రాంతాలకు మరమ్మతులు చేయగా.. చివరగా ప్రధానంగా దెబ్బతిన్న ప్రాంతంలో పునరుద్ధరణ పనులు వేగంగా సాగుతున్నాయి. నిబంధనలకు అనుగుణంగా పనులు చేపట్టాలని.. ట్రాక్‌ను రెడీ చేసి రాకపోకలు ప్రారంభించాలని సూచించారు. ఆయన వెంట ఎస్‌సీఆర్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ డీ మిశ్రా, చీఫ్ ఇంజినీర్ ఎస్ బ్రహ్మానందం, ప్రిన్సిపల్ ఫైనాన్షియల్ అడ్వైజర్ వివేకానంద్ ఉన్నారు.

భారీ వర్షాలకు 754 రోడ్లు ధ్వంసం

- శాశ్వత మరమ్మతులకు రూ.673.29 కోట్లు అవసరం
- ప్రత్యేకంగా అర్‌అండ్‌బీలో కంట్రోల్ రూమ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పంచాయతీరాజ్, రోడ్లు, భవనాల శాఖకు చెందిన రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ మేరకు ఇరు శాఖల ఉన్నతాధికారులు సహాయక చర్యలు చేపడుతూనే నష్టాలను అంచనా వేయాలని సర్కారు ఆదేశించింది. ఈ మేరకు ఉన్నతాధికారులు కింది స్థాయి ఇంజినీర్లకు ఆదేశించారు. యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలంటూ సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 754 రోడ్లు దెబ్బతినగా, వాటి శాశ్వత ప్రాతిపదికన పునరుద్ధరించడానికి రూ.673.29 కోట్లు అవసరమని అంచనాకు వచ్చారు. హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్‌లో ఆర్‌అండ్‌జతీ రాష్ట్ర కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. అన్ని జిల్లాల్లో రికార్డు స్థాయిలో వర్షాలు కురవడంతో చాలా ప్రాంతాల్లో రోడ్లు కొట్టుకుపోయాయి. జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, పంచాయతీరాజ్ రోడ్లు ఏ మేరకు ధ్వంసం కావడం, దెబ్బతినడం తదితర అంశాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని చెప్పారు. చాలా జిల్లాల్లో పెద్ద ఎత్తున వరద పోటెత్తడంతో చెరువుల కట్టలు తెగిపోయాయి. ఈ వానల కారణంగా ఏపీ-తెలంగాణ మధ్య రాకపోకలకు తీవ్ర ఆటంకాలు ఏర్పడ్డాయి. తెలంగాణ -ఏపీ సరిహద్దు రామాపురం వద్ద చిమిర్యాల వాగు ఉధృతంగా ప్రహిస్తున్నది. రోడ్ల నష్టాన్ని అంచనావేసేందుకు ఆర్‌అండ్‌బీ శాఖ ప్రత్యేకంగా కంట్రోల్ రూం ఏర్పాటు చేసింది. సహాయక చర్యలూ తీసుకుంటున్నారు. ఇదిలావుండగా 119 పంచాయతీరాజ్ రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఎక్కువగా ఖమ్మం-భద్రాద్రి ములుగు-నల్లగొండ రోడ్లు ధ్వంసమైనట్లు పంచాయరాజ్ ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. సూర్యాపేట జిల్లాలో దాదాపు 11 రోడ్లు కొట్టుకుపోయాయి. వాటిని మరమ్మతు చేయడానికి రూ.23 కోట్లు అవసరమవుతాయని అధికారులు అంచనాకు వచ్చారు. మిగతా రోడ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని అంటున్నారు. వాగులు, వంకలు, పొంగిపోర్లడంతో రోడ్లు కొట్టుకుపోయి రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. హన్మకొండ, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, యాదాద్రి-భువనగిరి, వికారాబాద్, సిద్ధిపేట, కామారెడ్డి, ఖమ్మం, నాగర్‌కర్నూల్ తదితర జిల్లాలో రోడ్లు దెబ్బతిన్నాయి.

వాస్తవాలను విశ్లేషిస్తే బెదిరింపులా?

- ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై ఈటల అనుచరుల బెదిరింపులు మానుకోవాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రముఖ రాజకీయ, సామాజిక విశ్లేషకులు, మేధావి ప్రొఫెసర్ కె నాగేశ్వర్‌ను మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ అనుచరులు వరుసగా ఫోన్లు చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి జాన్ వెస్లీ, టి స్కైలాబ్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తక్షణమే ఆ బెదిరింపులు మానుకోవాలనీ, పోలీసు ఉన్నతాధికారులు నాగేశ్వర్‌కు రక్షణ కల్పిస్తూ, బెదిరింపులకు పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో, దేశంలో జరుగుతున్న పరిణామాలను రోజువారీగా విశ్లేషిస్తూ ప్రజలకు వాస్తవాలను తెలియజేస్తున్న నాగేశ్వర్‌పై ఈటల అనుచరులు బెదిరింపులకు పాల్పడటం అప్రజాస్వామిక చర్య అని పేర్కొన్నారు. ఆయన వ్యాఖ్యలు నిరాధారమైతే ఈటల ప్రెస్‌మీట్ ద్వారా గానీ, వీడియో ద్వారా గానీ తన అభిప్రాయాలు తెలియజేయొచ్చని తెలిపారు. భావ ప్రకటన స్వేచ్ఛను సైతం హరించే బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ నియంత పోకడలు ప్రజాస్వామ్యంలో కుదరదని హెచ్చరించారు. ఇప్పటికైనా నాగేశ్వర్‌పై బెదిరింపులకు పాల్పడిన దానికి సంబంధించి ఈటల రాజేందర్ తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

‘మహాలక్ష్మి’కి ‘నకిలీ’ బెడద

- నకిలీ ఆధార్ కార్డులతో కండక్టర్లకు తలనొప్పులు
- గుర్తించకుంటే పైఅధికారులు సీరియస్ అవుతున్నారని ఆవేదన
- సిటీలోని కొన్ని రూట్లలో కొంతమంది తప్పుడు మార్గాలు
- స్మార్డ్ కార్డులతోనే సమస్యకు పరిష్కారం



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉచిత బస్సు ప్రయాణ పథకం ‘మహాలక్ష్మి’లో నకిలీలతో కండక్టర్లకు తలనొప్పులు వస్తున్నాయి. సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు బస్సుల్లో ఈ పథకాన్ని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిఎస్‌ఆర్‌టిసి) రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తోంది. ఆర్టీసీ బస్సుల్లో గతంలో రోజుకు సగటున 35లక్షల మంది ప్రయాణం చేయగా.. మహాలక్ష్మి పథకం అమల్లోకి వచ్చిన తర్వాత ఆ సంఖ్య 55లక్షలకు పెరిగింది. ఆధార్, ఓటర్ ఐడీ వంటి గుర్తింపు కార్డు చూపించి ఫ్రీ జర్నీ చేసే సౌలభ్యాన్ని ప్రభుత్వం కల్పించిన విషయం తెలిసిందే. అయితే, తెలంగాణ కార్డు లేని కొంతమంది నకిలీ కార్డులు సృష్టించి ప్రయాణిస్తున్నారని తెలిసింది. దీంతో కండక్టర్లు ఇబ్బందులు పడుతున్నారు. గుర్తించకుంటే చెకింగ్‌ల సమయంలో పై అధికారుల వద్ద మాటలు పడాల్సి వస్తోందని అవేదన చెందుతున్నారు. ఇలాంటివి హైదరాబాద్‌లో ఎక్కడో చోట బయటపడుతున్నాయని తెలిసింది. ఒకరిద్దరు చేసే తప్పుడు చర్యల వల్ల లక్షలాది మందికి ఉపయోగపడే పథకాన్ని విమర్శించే వారికి అవకాశం కల్పించినట్లవుతుందని కండక్టర్లు అంటున్నారు. నకిలీ కార్డులను గుర్తించే సాధనాలు ఏవీ ఆర్టీసీ వద్ద లేకపోవడంతో కండక్టర్లు తిప్పలు పడుతున్నారు. పథకం దెబ్బతినకుండా పటిష్టంగా అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ‘మహాలక్ష్మి’ పథకానికి మహిళా ప్రయాణికుల నుంచి భారీ స్పందన లభిస్తోంది. ప్రతి రోజూ సగటున 30 లక్షల మంది మహిళలు రాకపోకలు సాగిస్తున్నారు. పురుషులతో కలుపుకుంటే మొత్తంగా రోజూ 54.19లక్షల మందిని ఆర్టీసీ సురక్షితంగా సంస్థ గమ్యస్థానాలకు చేర్చుతోంది. ప్రయాణికుల్లో 50 శాతానికిపైగా మహిళ ప్రయాణికులే ఉంటున్నారు. బస్సులు కిక్కిరిసిపోతుండటంతో ఒక్కోసారి కండక్టర్లకు టిక్కెట్లు జారీ చేసేందుకు వీలు కూడా కలగడం లేదు. అధికంగా మహిళలే బస్సుల్లో ప్రయాణిస్తున్నారని కండక్టర్లు చెబుతున్నారు. కానీ కొందరు మహిళలు తమ ప్రయాణ సమయంలో గుర్తింపు కార్డులకు బదులు.. వాటి ఫొటో కాపీలను తెస్తున్నారని, స్మార్ట్ ఫోన్‌లలో సాఫ్ట్ కాపీలు చూపిస్తున్నారని చెబుతున్నారు. ఈ సమస్య ఎక్కువగా హైదరాబాద్‌లోనే ఉందని కండక్టర్లు అంటున్నారు. గుర్తింపు కార్డుల్లో ఫొటోలు స్పష్టంగా ఉండటం లేదన్నారు. చాలా మంది ఆధార్ కార్డుల్లో చిన్న నాటి ఫొటోలు ఉన్నా.. అప్‌డేట్ చేసుకోకుండా వచ్చేవారితో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు కండక్టర్లు వాపోతున్నారు.

తెలంగాణ ఉంటే చాలు..ఒకే..!

ఉచిత బస్సు పథకం కేవలం తెలంగాణ రాష్ట్రానికి చెందిన మహిళలకే వర్తిస్తోంది. ఇతర రాష్ట్రాల మహిళలు విధిగా చార్జీలు చెల్లించి టికెట్ తీసుకోవాలి. అయితే, గుర్తింపు కార్డులపై తెలంగాణ ప్రభుత్వం అని ఉంటే ఆర్టీసీ జీరో టికెట్లు జారీ చేస్తోంది. 40 మంది ప్రయాణం చేసేచోట వంద మందికిపైగా ఎక్కుతుంటే ఒరిజనల్ లేదా నకిలీ కార్డులు అనేవి గుర్తించలేకపోతున్నామని కండక్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఒకవైపు ఒత్తిడికి గురవుతుంటే.. మరోవైపు పనిష్‌మెంట్‌లు తప్పడం లేదని మహిళా కండక్టర్లు ఆవేదనతో చెబుతున్నారు. అందువల్ల తెలంగాణ మహిళల పేరుతో స్మార్ట్ కార్డులు జారీ చేస్తే.. ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. టికెట్లు ఇవ్వడానికి అవకాశం ఉంటుందన్నారు.

వరద పరిస్థితులు కలచివేశాయి

- వెంకయ్య నాయుడు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలుగు రాష్ట్రాల్లో వరద పరిస్థితులు తనను తీవ్రంగా కలచివేశాయని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీకి ఫోన్ చేసి ఇక్కడి పరిస్థితులను వివరించినట్లు తెలిపారు. తెలుగు రాష్ట్రాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు వెల్లడించారు. రెండు తెలుగు రాష్ట్రాల సిఎంలతో ఇప్పటికే మాట్లాడినట్లు ప్రధాని తనతో అన్నారని, సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారని ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు సోమవారం తెలిపారు. ఎపి, తెలంగాణ సిఎంల సహాయ నిధికి చెరో రూ.5లక్షల చొప్పున విరాళాన్ని ప్రకటించారు. తన కుమారుడు, కుమార్తె విడివిడిగా చెరో రూ.2.5లక్షల చొప్పున అందజేశారని ఆయన వెల్లడించారు.

వరద బాధితులకు అండగా నిలవండి

- బిజెపి కార్యకర్తలకు జెపి నడ్డా పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారీ వర్షాలు, వరదల వల్ల నష్టపోయిన ప్రజలను ఆదుకోవాలని పార్టీ కార్యకర్తలకు బిజెపి జాతీయ అధ్యక్షులు నడ్డా పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఫోన్ చేసి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. భారీ వర్షాలకు రాష్ట్రంలో పలువురు మృత్యువాత పడటం, ఆస్తులు ధ్వంసం కావడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఆహారం, తాగు నీరు అందించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.

ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై దాడి సరికాదు


- హరీశ్‌రావు ఖండన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సోషల్ మీడియా వేదికగా మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై బిజెపి చేస్తున్న దాడిని మాజీ మంత్రి హరీష్‌రావు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బిజెపికి చెందిన కొంతమంది నాయకులు చేస్తున్న అనుచిత దాడి ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ విమర్శలను జవాబుగా రాజకీయ విమర్శలతోనే ఎదుర్కోవాలని హితవు పలికారు. అంతేగానీ, అందుకు భిన్నంగా భౌతిక దాడులు చేస్తామనీ, బయట తిరగనివ్వబోమని బెదిరిస్తూ తన వ్యక్తిత్వాన్ని హననం చేసే విధంగా దుర్భాషలాడటం గర్హనీయమని పేర్కొన్నారు.

మారుతి సుజుకి అరెనాకు ఏడేళ్లు

హైదరాబాద్ : మారుతి సుజుకికి చెందిన ఆటోమోటివ్ నెట్‌వర్క్ అరెనా ఏడేళ్ల వార్షికోత్సవాలు జరుపుకుంటున్నట్లు తెలిపింది. ప్రతీ ఏడాది 11 లక్షల కొత్త కుటుంబాలకు చేరువ అవుతున్నట్లు పేర్కొంది. గడిచిన ఏడేళ్లలో దేశ వ్యాప్తంగా 82 లక్షల వినియోగదారులకు సేవలందించినట్లు తెలిపింది. తమ విక్రయాల్లో ప్రతీ 10 కార్లలో ఐదు అరెనా ఛానల్ నుంచే డెలివరీ అవుతున్నాయని వెల్లడించింది.



ఉజ్జీవన్ ఎస్‌ఎఫ్‌బి కొత్త క్యాంపెయిన్

బెంగళూరు : ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ కొత్తగా "మీకు కావలసిన విధంగా బ్యాంక్ చేయండి, ఉజ్జీవన్ దీన్ని సులభతరం చేస్తుంది" అంటూ బ్రాండింగ్ క్యాంపెయిన్‌ను ప్రారంభించింది. సురక్షితమైన, సజావు అనుభవంతో బ్యాంకు స్వేచ్ఛను అందించడంలో బ్యాంక్ నిబద్ధతను ఈ ప్రచారం నొక్కి చెబుతుందని ఉజ్జీవన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కరోల్ ఫుర్టాడో పేర్కొన్నారు. సోమవారం నుంచి 11 ప్రాంతీయ భాషల్లో నూతన ప్రచారాన్ని ప్రారంభించినట్లు వెల్లడించారు.

వేగవంతంగా క్యాబ్ బుకింగ్స్

- 'మన యాత్రి' వెల్లడి

హైదరాబాద్ : నగరానికి చెందిన క్యాబ్, ఆటో బుకింగ్ యాప్ 'మన యాత్రి'కి విశేష ప్రాచుర్యం లభిస్తున్నట్లు ఆ సంస్థ తెలిపింది. పీపుల్ ఫస్ట్ విధానంతో మన యాత్రి 35,000 ఆటోలు, 25,000 క్యాబ్ సర్వీసులతో సేవలందిస్తున్నట్లు పేర్కొంది. ఆటోలకు సగటున 30 సెకన్లు, క్యాబ్‌లకు 40 సెకన్ల సమయంతో వేగవంతమైన బుకింగ్‌లను అందిస్తున్నట్లు తెలిపింది. ఇది డ్రైవర్లకు కమీషన్ లేకుండా రూ.800 కోట్లు, ప్రయాణికులకు వారి ప్రయాణ ఖర్చులపై దాదాపు రూ .100 కోట్లు ఆదా చేయడానికి సహాయపడుతుందని వెల్లడించింది.

టాస్క్‌తో మాట ఒప్పందం

- ఎఐపై ఆన్‌లైన్‌లో శిక్షణ

ప్రజాశక్తి - హైదరాబాద్

తెలంగాణలోని యువతకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ)పై ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ అందించేందుకు టాస్క్ సంస్థతో మాట ఒప్పందం కుదుర్చుకోవడం అభినందనీయమని ఐటి శాఖ ముఖ్యకార్యదర్శి జయేష్ రంజన్ అన్నారు. హెచ్ఐసిసి లో ఈనెల 4 5 తేదీల్లో ఏఐ సమ్మిట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ టాస్క్ కార్యాలయంలో టాస్క్ సిఇఒ శ్రీకాంత్ సిన్హా, మాట ఫౌండర్ శ్రీనివాస్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసుకున్నారు. మాట ఫౌండర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు వారానికి నాలుగు క్లాసులు, రోజుకు రెండు గంటలు చొప్పున ఉచిత శిక్షణ ఇవ్వనున్నామన్నారు. మొదటగా ఈ కార్యక్రమం కామారెడ్డి జిల్లాలో ప్రారంభించినట్లు తెలిపారు. 200 పైగా విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని రెస్పాన్స్ బాగా ఉందని అయన సంతోషాన్ని వ్యక్తం చేశారు.

నూతన ఆర్థిక విధానాలతో
వ్యవసాయ రంగం దివాళా

- ప్రతి ఉద్యమం రైతాంగ పోరాటాలతోనే ప్రారంభం
- కార్మిక, కర్షక ఐక్యతతోనే బలమైన ఉద్యమాలు
- క్షేత్రస్థాయిలో సమస్యలపై ఉద్యమించాలి
- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో నూతన ఆర్థిక విధానాలు తెర మీదకు వచ్చిన తర్వాత వ్యవసాయ రంగం క్రమంగా దివాళా తీస్తూ వస్తోందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. నేడు బిజెపి ప్రభుత్వం సైతం వ్యవసాయ రంగాన్ని పూర్తిగా కార్పొరేట్ శక్తుల చేతిలో పెట్టే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. వీటిపై క్షేత్రస్థాయిలో ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని కోరారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పరిధిలోని రాందాస్‌పల్లి శుభం కన్వెన్షన్ హాల్‌లో మూడు రోజులుగా జరుగుతున్న తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర శిక్షణా తరగతులు సోమవారం విజయవంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేసి భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించారు. ఈ సందర్భంగా పోతినేని మాట్లాడుతూ.. కార్మిక, కర్షక ఐక్య ఉద్యమాల ద్వారానే సమస్యలు పరిష్కరించుకోగలుగుతామన్నారు. బ్రిటిష్ పాలన నుంచి భారతదేశాన్ని విముక్తి చేసుకోవడంలోనూ రైతాంగ ఉద్యమాలు కీలకంగా పని చేశాయని గుర్తు చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం సైతం రైతుల భాగస్వామ్యంతోనే 10వేల ఎకరాల భూములను ఎర్రజెండా నాయకత్వంలో పంపిణీ చేసిందన్నారు. కానీ పారిశ్రామికవేతలు, సామ్రాజ్యవాదులు, దోపిడీదారులు కుమ్మక్కై వ్యవసాయ రంగాన్ని కాజేయాలని ప్రయత్నం చేస్తున్నాయన్నారు. అందులో భాగంగానే ప్రధాని మోడీ నాయకత్వంలో తీసుకువచ్చిన నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రైతాంగం బలమైన ఉద్యమాన్ని నిర్వహించి, విజయం సాధించిందన్నారు. చివరికి ఆ నల్ల చట్టాలను వెనక్కి తీసుకోక తప్పలేదని తెలిపారు. అయినా మోడీ ప్రభుత్వం అదే విధానాలను మరో రూపంలో అమలు చేసేందుకు ప్రయత్నిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూమి నుంచి రైతులను దూరం చేసే ఈ విధానాలకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమాలను నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. మరోవైపు రాష్ట్రంలో ఆర్ఓఆర్ చట్టం తీసుకొచ్చిన తర్వాత అనుభవదారు కాలమ్ లేకుండా చేశారని, ఈ కాలాన్ని భూమాత యాప్‌లో చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆధార్ కార్డు లాగే భూధార్ కార్డులు ఇస్తామంటున్న ప్రభుత్వం సమగ్ర భూ విధానం తీసుకురాకుండా ఏ కార్డు ఇచ్చినా ఉపయోగం లేదన్నారు. కౌలు రైతులు నిర్లక్ష్యానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. భూసేకరణ చేస్తే 2013 సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వాలు చేసిన తప్పిదాలను ప్రస్తుత ప్రభుత్వం చేయొద్దని విన్నవించారు. నకిలీ విత్తనాలు, ఎరువుల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

రెండు తీర్మానాలకు ఆమోదం

మూడు రోజుల పాటు జరిగిన రాజకీయ శిక్షణా తరగతుల్లో రెండు తీర్మానాలను ప్రతినిధులు ఆమోదించారు. రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించి, రైతును ఆదుకోవాలని సభ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఎకరానికి రూ.25 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేసింది. వాణిజ్య పంటలకు రూ.50వేల, మెట్ట పంటలకు రూ.50వేల చొప్పున నష్టపరిహారం అందజేయడంతో పాటు మృతుల కుటుంబాలకు రూ.50 లక్షలు, గాయపడిన కుటుంబానికి రూ.లక్ష చొప్పున ఎక్స్‌గ్రేషియా అందజేయాలని, మృత్యువాత పడిన పశువులకు నష్టపరిహారం అందజేయాలని తీర్మానించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.రెండు లక్షల రుణమాఫీని అర్హులందరికీ ఏకకాలంలో మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు సైతం రుణమాఫీ చేసి ఆదుకోవాలని కోరారు. రేషన్ కార్డు ప్రామాణికంగా కాకుండా రుణం పొందిన వారందరికీ రుణాలను మాఫీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, రాష్ట్ర నాయకులు పి.జంగారెడ్డి, మూడ్ శోభన్, బొంతల చంద్రారెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామచందర్, మధుసూదన్ రెడ్డి, ఇబ్రహీంపట్నం మండల అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణారెడ్డి, ముసలయ్య, శ్రీనివాసరెడ్డి, విక్రమ్, ప్రజా సంఘాల నాయకులు, తదితరులు ఉన్నారు.

హంస హోమియోపతి కళాశాలలో పాలియేటివ్ కేర్ ఇంటిగ్రేషన్ వర్క్‌షాప్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హంస హోమియోపతి వైద్య కళాశాల, పరిశోధన కేంద్రం, నాప్ క్రైమ్ తెలంగాణ చాప్టర్ అనుబంధంతో సంయుక్తంగా పాలియేటివ్ కేర్ ఒరియెంటేషన్, ఇంటిగ్రేషన్, ఇంటర్వెన్షన్ జాతీయ వర్క్‌షాప్‌ను కళాశాల ఆడిటోరియంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుష్ డైరక్టర్ ఎం.ప్రశాంతి మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రతి మనిషి తన జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు అన్ని రకాల వైద్య విధానాలు వాడవలసిన అవసరం ఉందని తెలిపారు. జెయస్‌పియస్ ప్రభుత్వ హోమియోపతిక్ వైద్య కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ సి.హెచ్.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... అల్లోపతీ , ఆయుర్వేద , యునాని, హోమియో, నేచురోపతి, సిద్ధ వంటి వైద్య విధానాల ప్రాముఖ్యతను తెలిపారు. హంస హోమియోపతి వైద్య కళాశాల డైరక్టర్ డాక్టర్ ఉమేష్ అక్కలదేవి మాట్లాడుతూ.. క్యాన్సర్, బ్రెయిన్ స్ట్రోక్, పక్షవాతం వంటి వ్యాధులకు పాలియేటివ్ కేర్ చాలా అవసరం ఉంటుందని, ఈ వర్క్‌షాప్ ద్వారా విషయ పరిజ్ఞానం పొందవచ్చుని తెలిపారు. వర్క్‌షాప్‌లో రాష్ట్రవ్యాప్తంగా 700 మంది వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ఉందాం

- పని గంటలతో సంబంధం లేకుండా పనిచేద్దాం
- తెలంగాణ ఉద్యోగ జెఎసి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరద సహాయ, పునరావాస కార్యక్రమాల్లో పాల్గొంటున్న ఉద్యోగులు, అధికారులకు తెలంగాణ ఉద్యోగ జెఎసి అభినందనలు తెలిపింది. ప్రకృతి విపత్తులు సంభవించిన ప్రస్తుత సమయంలో ప్రజలకు అండగా ఉండాలని పిలుపునిచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఆదేశాలను పాటించాలనీ, పని గంటలతో సంబంధం లేకుండా నిర్విరామంగా పనిచేయాలని కోరింది. సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాలనీ, ప్రజలను కాపాడుకోవాలనీ, సంపదను పరిరక్షించుకోవాలని సూచించింది. ఈ మేరకు తెలంగాణ ఉద్యోగ జెఎసి చైర్మన్, టిఎన్‌జిఒ అధ్యక్షులు మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్, టిజిఒ అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొన్ని రోజులుగా రాష్ట్రంలో కురుస్తున్న వర్ష బీభత్సానికి రాష్ట్రంలో మారుమూల ప్రాంతాల నుంచి పట్టణాల వరకు జనజీవనం స్థంభించిపోయిందని తెలిపారు. ప్రజలు ధన, ప్రాణ, పశు పక్షాదులు, వ్యవసాయ పంటలు, సంపదలకు తీవ్ర నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. ప్రభుత్వంలో భాగమైన ఉద్యోగులు, అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు ప్రజలకు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. వరద సహాయ కార్యక్రమాల్లో నిర్విరామంగా పాల్గొనాలని కోరారు. ఇలాంటి క్లిష్ట సమయంలో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రజలకు ప్రాణనష్టం రాకుండా సహాయం చేయడానికి పనిగంటలతో సంబంధం లేకుండా పనిచేయాలని సూచించారు. ఉద్యోగులు, అధికారులు ఉన్నారంటూ మరింత నిబద్ధతతో పనిచేసి ప్రజల్లో భరోసా కల్పించాలని తెలిపారు.

వరద బాధితులను ఆదుకోండి

- వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందించాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో సోమవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయని, గ్రామాలు వరదల్లో చిక్కుకున్నాయని, ప్రజలు అల్లాడిపోతున్నారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 18 మంది చనిపోయారని, ఆ కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని కోరారు. వరద ప్రాంతాల్లో వెంటనే సహాయక చర్యలు చేపట్టి బాధితులను ఆదుకోవాలన్నారు. వరదల కారణంగా అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. వానాకాలం పంట సీజన్ పూర్తి కావస్తోందని, ఇప్పటి వరకు పెట్టుబడి సహాయం అందించకపోవడంతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తక్షణమే రైతు భరోసా కింద సహాయమందించాలని కోరారు. కౌలు రైతులను కూడా ఆదుకోవాలన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. సాగర్ ఎడమ కాలువ ఆయకట్టు బలహీనంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వానికి, అధికారులకు అనేకసార్లు విజ్ఞప్తి చేసినా మరమ్మతులు చేయకపోవడంతో ప్రస్తుత వరదల కారణంగా కాలువ కట్టలకు గండ్లు పడే ప్రమాదం ఉందని తెలిపారు. ఇప్పటికే నడిగూడెం వద్ద గండిపడి వేలాది ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందన్నారు. కాల్వ కట్టలు బలహీనంగా ఉండటం వల్ల ఎడమ కాల్వకు నీటి విడుదల ఆపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే మరమ్మతులు చేపట్టి పూర్తిస్థాయిలో నీరు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు నారి ఐలయ్య, తుమ్మల వీరారెడ్డి, డబ్బికార్ మల్లేష్, జిల్లా నాయకులు పాలడుగు నాగార్జున కందాల ప్రమీల, చినపాక లక్ష్మీనారాయణ, పాలడుగు ప్రభావతి ,సయ్యద్ హాశం, వీరే పల్లి వెంకటేశ్వర్లు, రవి నాయక్ పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్లతో ఆస్పత్రుల సిసి కెమెరాల అనుసంధానం

- మంత్రి దామోదర రాజనర్సింహ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో అన్ని స్థాయిల్లో ఆస్పత్రుల్లో సిసి కెమెరాలను స్థానిక పోలీస్ స్టేషన్లతో అనుసంధానించాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆయన ఆస్పత్రుల్లో భద్రతపై ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహిళా డాక్టర్లు, మహిళా నర్సింగ్ ఆఫీసర్లు తదితర సిబ్బందికి రక్షణగా రాత్రి సమయాల్లో షీ టీంలతో పెట్రోలింగ్ చేసేలా నిబంధనలు రూపొందించాలని సూచించారు. అన్ని బోధనాస్పత్రుల్లో అవుట్ పోస్టులు శాశ్వత ప్రాతిపదికన నిర్మించడానికి చర్యలు చేపట్టాలని కోరారు. టిమ్స్ ఆస్పత్రుల్లో ఇప్పటికే పోలీస్ అవుట్ పోస్టుల కోసం స్థలం కేటాయించగా, 10 బోధనాస్పత్రుల్లో అవుట్ పోస్టులను నిర్మించినట్టు తెలిపారు. ప్రయివేటు సెక్యూరిటీ ఏజెన్సీలు తప్పనిసరిగా పిఎస్ఏఆర్ (ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ - రెగ్యులేషన్స్) యాక్ట్-2015 ప్రకారం గుర్తింపు పొంది ఉండాలని మంత్రి ఆదేశించారు. భద్రతపై స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌ఓపీ) రూపొందించాలని మంత్రి సూచించారు. ఆస్పత్రులలో మహిళ డాక్టర్లు, నర్సింగ్ స్టాఫ్, సిబ్బంది భద్రతపై సుప్రీంకోర్టు ఇచ్చిన నిబంధనల మేరకు రాష్ట్ర, జిల్లా స్థాయిలలో హాస్పిటల్స్ సేఫ్టీ కమిటీ భద్రతాపరమైన నియమాలను రూపొందించి ఈ నెల 14వ తేదీలోపు రిపోర్టు సమర్పించాలని కోరారు. వైద్యులు, నర్సుల భద్రతలో భాగంగా నమోదైన కేసులను యాక్ట్ 11 ఆఫ్ 2008 ప్రకారం రిజిస్టర్ చేయాలని ఈ సమీక్షలో నిర్ణయించారు. ప్రతి ఆస్పత్రిలో సెక్యూరిటీ హౌజ్‌ను ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి రవి గుప్త, తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ అదనపు డైరెక్టర్ జనరల్ అనిల్ కుమార్, రాష్ట్ర ప్రజారోగ్యం , కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, రాష్ట్ర న్యాయ శాఖ కార్యదర్శి రెండ్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎన్‌డిపి వల్లే హైదరాబాద్‌కు వరద ముప్పు తప్పింది

- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎస్ఎన్‌డిపి) కారణంగానే హైదరాబాద్‌కు వరద ముప్పు తప్పిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనాలని గత ప్రభుత్వం ముందు చూపుతో తీసుకున్న కార్యక్రమంతోనే ఇది సాధ్యమైందని తెలిపారు. "సమైక్య రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలు వచ్చిన ప్రతి సందర్భంలోనూ హైదరాబాద్‌లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యేవి.. ఫలితంగా పేద, మధ్యతరగతి ప్రజల జనజీవనం పూర్తిగా అస్తవ్యస్థంగా మారేది. వరదనీరు, మురుగునీటి వ్యవస్థను పూర్తి స్థాయిలో పటిష్టపరిచేందుకు రూ. 985 కోట్లతో 60 పనులు చేపట్టడం వల్లే ఈ రోజు వరద ముప్పు తప్పింది. ఇదే విషయాన్ని ఆయా ప్రాంతాల్లోని ప్రజలే హర్షం వ్యక్తం చేయడం గొప్ప సంతృప్తినిస్తోంది" అని కెటిఆర్ పేర్కొన్నారు.



అధికారులను అడ్డుకుంటున్న రైతులు

సాగు భూములను వదులుకోబోం..

- సర్వే కోసం వచ్చిన అధికారులను అడ్డుకున్న రైతులు
- భూ సేకరణకు వ్యతిరేకంగా రహదారిపై బైఠాయింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సారవంతమైన సాగు భూములను ఫార్మా కంపెనీల పేరిట లాక్కోవద్దని.. ఎట్టి పరిస్థితుల్లో ఆ భూములను వదులుకోబోమని బాధిత రైతులు అధికారులకు స్పష్టం చేశారు. అదనపు కలెక్టర్ మాధురి, ఆర్‌డిఒ రాజు, తహశీల్దార్ భూపాల్, ఉప తహశీల్దార్ రాజిరెడ్డితో కలిసి ఫార్మాసిటీ ఏర్పాటుకు భూ సేకరణ కోసం సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండలంలోని డప్పురు గ్రామంలో భూములను పరిశీలిస్తుండగా రైతులు అడ్డుకున్నారు. పచ్చని పల్లెల్లోకి కాలుష్య కంపెనీలు తేవొద్దని నినాదాలు చేస్తూ.. మల్గి గ్రామస్తులతో కలిసి గంటలపాటు రోడ్డుపై బైఠాయించారు. సాగు భూములను కంపెనీలకు ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. ఈ విషయం తెలుసుకున్న జహీరాబాద్ డిఎస్‌పి రామ్మోహన్‌రెడ్డి, సిఐ హనుమంతు, శివలింగం, డివిజన్ ఎస్ఐతో ఘటనా స్థలానికి చేరుకుని రైతులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ ఫార్మాసిటీ భూ సేకరణను వెంటనే వెనక్కు తీసుకోవాలని అదనపు కలెక్టర్, అధికారులతో రైతులు వాగ్వాదానికి దిగారు. ఎట్టి పరిస్థితుల్లో భూములు వదులుకోమని తేల్చిచెప్పారు. ఈ నిరసనలో ఆయా గ్రామాల భూ నిర్వాసితులు డప్పూర్ శివరాజ్, రవికుమార్, రవి గౌడ్, కిరణ్ గౌడ్, అరుణ్, మారుతి యాదవ్ తదితరులున్నారు.

చెరువులు, రోడ్లకు మరమ్మతులు చేయాలి

- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

బుంగలు పడిన చెరువులకు, తెగిపోయిన రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు చేసి ప్రజలకు ఉపశమనం కలిగించాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మెదక్ జిల్లా హవేలీఘనపూర్ మండల పరిధిలోని ముత్తాయి కోట, లింగసాన్‌పల్లి గ్రామాల్లో వర్షంతో కొట్టుకుపోయిన రోడ్లు, తెగిపోయిన చెరువులు, చెరువుకు పడిన బుంగలను జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాండాలకు వెళ్లే రహదారులు భారీ వర్షానికి కొట్టుకుపోవడం వల్ల ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని, వాటిని పునరుద్ధరించాలని సూచించారు. చెరువుకు పడిన బుంగలను కూడా తాత్కాలిక మరమ్మత్తులు చేసి ప్రజలకు ఉపశమనం కల్పించాలని ఆదేశించారు. పరిశీలించిన వారిలో.. హవేలీ ఘనపూర్, మెదక్ తహసీల్దార్‌లు నవీన్, లక్ష్మణ్ బాబు, ఇరిగేషన్ ఏఈ శ్రీహరి గౌడ్, మండల సర్వేయర్ రమేష్ గౌడ్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

సాంస్కృతిక పునర్జీవనం వైపు తెలంగాణ అడుగులు

- కళలు, కళాకారులకు సర్కార్ పెద్దపీట
- ప్రత్యేక దృష్టి సారించిన సిఎం రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సాంస్కృతిక పునర్జీవనం వైపు తెలంగాణ అడుగులు వేస్తోంది. ప్లాస్టిక్ అందాలకు ప్రాణప్రతిష్ట చేసిన పదేళ్ల పాలకుల రీతికి భిన్నంగా కాంగ్రెస్ సర్కార్ ఇక్కడి మట్టి వాసనలను గుబాలింపజేస్తోంది. పల్లెపల్లెనా జానపదం పల్లవించే తెలంగాణ నేలను పునీతం చేసేందుకు కవులు, కళాకారులు కసరత్తు చేస్తున్న తరుణమిది. తెలంగాణ సాయుధ పోరాట కాలం నుంచే పాటలు ప్రజల జీవనంలో భాగమయ్యాయి. మలి దశ తెలంగాణ పోరులోనూ పాటలు పోరుబాటకు దారిదీపాలయ్యాయి. సుద్దాల హన్మంతు, గద్దర్ వంటి వారు వేసిన ఒరవడిలో వేలాది మంది కవులు, కళాకారులు జానపదాల రచన, ఆలాపనలో ముందుకు సాగుతున్నారు. యూట్యూబ్‌లో మిలియన్ల కొద్ది వీక్షకులు తెలంగాణ పల్లె పాటలను ఆస్వాదిస్తున్నారు. జానపద కళాకారులకు సరైన వేదిక కల్పించి వారికి ఉపాధి అవకాశాలు చూపడంతోపాటు తెలంగాణ సాంస్కృతిక అస్థిత్వానికి ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది.

బతుకమ్మకు ప్రపంచ వ్యాప్త గుర్తింపు

ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో పూలను పూజించే పండుగ బతుకమ్మ. తెలంగాణకే విశిష్టమైన ఈ సంస్కృతిని ప్రపంచవ్యాప్తంగా ఎలుగెత్తి చాటే ప్రణాళికను పర్యాటక శాఖ రూపొందిస్తోంది. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పాటు వివిధ దేశాల పర్యాటకులను బతుకమ్మ పండుగలో భాగస్వాములను చేసేందుకు ప్రయత్నిస్తోంది. దీంతో ప్రతి ఏటా ఆ సీజన్‌లో పర్యాటకులు రావడంతోపాటు మనదైన కళకు గుర్తింపు లభించనుందని భావిస్తోంది. మేడారంలో రెండేండ్లకోసారి జరిగే సమ్మక్క-సారలమ్మ జాతరకు తెలుగు రాష్ట్రాలతోపాటు పొరుగు రాష్ట్రాల యాత్రికులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ఈ జాతరకు గ్లోబల్ గుర్తింపు తెచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. పేరిణి, కొమ్ము, గుస్సాడి వంటి నృత్యాలకు పునర్జీవం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. హైదరాబాద్ బోనాలకు గుర్తింపు తెచ్చేందుకు నిధులతోపాటు అన్ని రకాల సహాయ, సహకారాలను ప్రభుత్వం అందిస్తోంది.

పర్యాటకానికి పెద్దపీట

భద్రాచలం గోదావరి చెంతన గిరిజన కొమ్ము నృత్యం,, పల్లెపల్లెనా సాగే బతుకమ్మ సంబురాలు, ఆదిలాబాద్ అడవుల్లో జలపాతాలు, హైదరాబాద్‌లో గోల్కొండ కోట, చార్మినార్, నాగార్జున సాగర్ బుద్ధవనం ఇలా ఎన్నో వైవిధ్యాలకు నెలవైన తెలంగాణను ప్రపంచ పర్యాటక పటంలో ప్రత్యేకత చాటేలా నిలపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఈ దిశగా అధికారులు కసరత్తు చేస్తున్నారు. పర్యావరణ చారిత్రక, అధ్యాత్మిక టూరిస్ట్ ప్రాంతాల గుర్తింపు, అభివృద్ధి దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. హిందూ, ముస్లిం, క్రైస్తవంతో పాటు బౌద్ధ, జైన ఆలయాలను చూసేందుకు పర్యాటకులను మరింతగా ఆకర్షించేలా ప్రణాళికలు రచిస్తున్నారు. పర్యాటకులు ఆయా ప్రాంతాలకు సందర్శించడానికే పరిమితం కాకుండా స్థానికంగా ఉన్న విశిష్టతలు, అక్కడి ఆహారం, ఆహార్యాన్ని ఆస్వాదించి అనుభూతి పొందేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

సర్పంచులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- మాజీమంత్రి వి శ్రీనివాస్‌గౌడ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ అధికారంలోకొచ్చి తొమ్మిది నెలలు కావొస్తున్నదనీ, సర్పంచులకు పెండింగ్ బిల్లులు ఎందుకు చెల్లించలేదని మాజీమంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. సర్పంచ్‌ల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. రూ.1300 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఇదే విషయమై వారు గవర్నర్‌ను కలిసి మొరపెట్టుకున్నారని గుర్తు చేశారు. కేంద్రం నుంచి వచ్చిన రూ.600 కోట్లు ఎక్కడికి పోయాయని ప్రశ్నించారు. గ్రామ పంచాయితీ ఉద్యోగుల జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద కాంట్రాక్టర్ల బిల్లులు నిలుపుదల చేసి సర్పంచ్‌లకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సర్పంచ్‌లెవరూ ఆత్మహత్యలకు పాల్పడొద్దని సూచించారు.

ప్రజల గుండెల్లో వైఎస్ స్థానం సుస్థిరం

- మహేష్ కుమార్ గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఒక ముఖ్యమంత్రిగానే కాకుండా పేదల కోసం అనేక పథకాలు తెచ్చిన మహనీయునిగా వైఎస్.రాజశేఖర్ రెడ్డి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. సోమవారం వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకు ముందు పంజాగుట్టలోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలతో నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. వైఎస్ఆర్ ఒక ముఖ్యమంత్రిగా కాకుండా ఒక సహచరునిగా అందరితో కలిసి ఉండేవారని గుర్తు చేసుకున్నారు. రాష్ట్రంలో వరదల నేపథ్యంలో తక్షణ సాయం ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ.. ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే బిఆర్ఎస్ బురద రాజకీయం చేస్తున్నదని విమర్శించారు. పిసిసి అధికార ప్రతినిధి భవానీరెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం సరైన చర్యలు తీసుకుంటే వర్షానికి హైదరాబాద్ అతలాకుతలమయ్యే పరిస్థితి వచ్చేది కాదని అభిప్రాయపడ్డారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ మాట్లాడుతూ.. ప్రజలు ప్రభుత్వం ప్రకటించిన టోల్ ఫ్రీ నెంబర్‌ను ఉపయోగించుకుని తమ సమస్యలు తెలపాలని కోరారు.